నిషేధిత శాప విముక్తి

చంద్రబాబు పాలనలో తీసుకున్న నిర్ణయం కావలి పట్టణ ప్రజలకు శాపంగా మారింది. సొంత పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో దాదాపు ఐదేళ్లుగా క్రయవిక్రయాలకు అవరోధంగా మారిన పరిస్థితుల నుంచి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవతో విముక్తి లభించింది. పట్టణంలోని వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో మూడు తరాలుగా ప్రజలు ఆస్తులుగా ఉన్న ఇంటి స్థలాలు, నివాస గృహాలు ఉన్న సర్వే నంబర్ 2048/బీ లో ఉన్న 157.42 ఎకరాల్లోని భూమిని 22 (ఏ) నిషేధిత భూముల జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణ ఆదేశాలు జారీ చేశారు.

- కావలి పట్టణ ప్రజల అవస్థలకు చెల్లుచీటి
- ఐదేళ్లకుపైగా జటిలంగా మారిన సమస్య
- ప్రజల సొంత భూములను నిషేధిత జాబితాలో చేర్చిన చంద్రబాబు ప్రభుత్వం
- ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండేళ్ల పోరాటం ఫలించిన వేళ
- నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ హరినాయణన్ చర్యలు



'సాక్షి'లో ప్రచురితమైన కథనం


30కెవిఎల్04-కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు

కావలి: చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు సమస్యలు సృష్టిస్తే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క సంతకంతో పరిష్కారాన్ని చూపించింది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం ప్రజల ప్రైవేట్ ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చి చేతులు దులుపుకుంది. ఈ సమస్య పరిష్కారానికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండేళ్లుగా చేస్తున్న పోరాటం ఫలించింది. కావలి పట్టణం విస్తరిస్తున్న క్రమంలో 1976లో అప్పటి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలాలు, వివిధ ప్రభుత్వ శాఖలకు కార్యాలయాల నిర్మాణానికి స్థల సేకరణపై దృష్టి సారించింది. పట్టణానికి పశ్చిమాన సర్వే నంబర్ 2048లో ఉన్న అటవీశాఖ భూములు 300 ఎకరాలు డీ ఫారెస్ట్ చేసింది. సర్వే నంబర్ 2048/ఏ, 2048/బీ వాటిని భిన్నాలుగా మార్చింది. ఇందులో 32 బిట్లను పబ్లిక్ స్థలాలుగా కేటాయించింది. ఆ స్థలాల్లోనే ప్రస్తుతం విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్‌శాఖ కార్యాలయాలు, ప్రభుత్వ హాస్టళ్లు, పార్కులు నిర్మించారు. మిగతా భూమిని ప్రభుత్వం ప్లాట్లుగా తయారు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులకు అప్పట్లో అంకణం రూ.7 వంతున 36 అంకణాలకు పట్టాలు ఇచ్చింది. 1,850 మంది ప్రభుత్వానికి మార్కెట్ ధర చెల్లించి ఇంటి స్థలాలు పొంది సొంతంగా ఇళ్లను నిర్మించుకున్నారు. పోలీస్‌శాఖ సిబ్బంది కోసం క్వార్టర్స్ సముదాయం, పోలీస్‌స్టేషన్, టెలికం శాఖ తమ ఉద్యోగులకు క్వార్టర్స్‌లు నిర్మించాయి. టీచర్స్ కాలనీ, లెక్చరర్స్ కాలనీలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో 100, 80, 60, 40 అడుగుల రోడ్లు నిర్మించారు. కాలక్రమంలో ప్రభుత్వం 2,000 మంది పేదలకు 12 అంకణాల చొప్పున ఉచితంగా ఇంటి స్థలాలు ఇచ్చింది. ఆ తర్వాత కాలంలో స్థలాలు క్రయవిక్రయాల ద్వారా అనేక చేతులు మారాయి. ఆయా ప్రాంతాలు ప్రస్తుతం వెంగళరావునగర్, తుఫాన్‌నగర్, ఇందిరానగర్‌గా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు 6,000 కుటుంబాలు ఉన్నాయి. 'నవవికాస్' సేవా సంస్థకు అప్పట్లోనే సుమారు 300 అంకణాలు, అమెరికాకు చెందిన ఆశానికేతన్ సేవా సంస్థకు మరో 300 అంకణాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

2018లో నిషేధిత జాబితాలోకి..

దాదాపు 42 ఏళ్లుగా పట్టా భూములుగా ఉన్న సర్వే నంబర్ 2048/ఏ, 2048/బీతో పాటు పట్టణంలోని జనతాపేట, వైకుంఠపురం తదితర ప్రాంతాల్లోని కొన్ని సర్వే నంబర్లను 2018లో రెవెన్యూ రికార్డుల ఆధునికీకరణ సమయంలో అప్పటి ప్రభుత్వ అధికారులు, పాలకులు నిషేధిత భూముల జాబితాలో చేర్చేశారు. ఆ విషయమై అప్పటి నుంచి ప్రజలు అధికారులకు, అప్పటి ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ చేసిన తప్పును సరిదిద్దకుండా వదిలేశారు.

రెండేళ్లుగా ఎమ్మెల్యే పోరాటం

గడిచిన ఐదేళ్లుగా ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇంటి ఆస్తులను అమ్మడానికి, అప్పుల కోసం చేసిన ప్రయత్నాలే ఏవీ ఫలించక నరకం అనుభవిస్తున్నారు. కనీసం ఆస్తులను పిల్లలక పంపకాలు చేయాలన్నా సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2020లో ఈ అంశాన్ని అసెంబ్లీలో చర్చించారు. ఆ తర్వాత ప్రభుత్వం ఈ సమస్యపై దృష్టి సారించింది. ఈ సమస్యపై 2021 ఆగస్టులో స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అప్పటి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిషేధిత భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తున్న నేపథ్యంలో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ సమస్యపై ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సైతం ఈ ఏడాది మార్చిలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టి పట్టా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయమై ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీ ఈ సమస్య తీవ్రత, ప్రజలు అవస్థలను తెలియజేస్తూ 'సాక్షి' పత్రికలో సమగ్ర కథనం ప్రచురితమైంది. రెండు నెలల క్రితం కావలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చుక్కల భూములకు పరిష్కారం చూపిస్తూ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్థానిక తహసీల్దార్, ఆర్డీఓలతో నివేదికలు సిద్ధం చేయించి కలెక్టర్‌కు ప్రతిపాదించారు. దీంతో పట్టణంలోని ప్రైవేట్ స్థలాలను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ కలెక్టర్ హరినారాయణన్ గత నెల 21వ తేదీ జిల్లా రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. దీంతో ఐదేళ్లుగా కావలి పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ఆస్తులకు సంబంధించిన సమస్య పరిష్కారమైంది.

క్లుప్తంగా

20వ వార్డు ఇన్‌చార్జిగా ప్రసాద్


నందవరం ప్రసాద్

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా నందవరం ప్రసాద్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి 20వ వార్డులో పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో నందవరం ప్రసాద్‌ను 20వ వార్డు ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

బీఎస్పీ వార్డు కమిటీ ఎన్నిక


బహుజన సమాజ్ పార్టీ సమావేశం

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీ పట్టణ కమిటీ సమావేశం ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఓబులేసు పిలుపునిచ్చారు. మున్సిపల్ వార్డు పార్టీ కమిటీల ఎన్నికల్లో భాగంగా 13వ వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతా రామచంద్రయ్య, కార్యదర్శి ఈసా జనార్దన్, కార్యవర్గ సభ్యుడిగా జే తిరుపాలు, వి ఉమాకేశవులు, ఈసా పుల్లయ్యను ఎన్నుకున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జ్యోతి శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయసు నుంచే భక్తిభావం అలవర్చాలి


మంచి మాట కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

ఆత్మకూరు: తల్లిదండ్రులు ఇళ్లల్లో తమ పిల్లలకు చిన్న వయసు నుంచే రామాయణ, భారత, భాగవతా గ్రంథాలు పురాణాల గురించి అవగాహన కల్పించాలని, దాని ద్వారా వారిలో భక్తిభావం అలవడేలా తర్ఫీదు ఇవ్వాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని మేధా ఆంగ్ల పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం మంచి మాట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. పలువురు వక్తలు అనేక విషయాలను వివరించారు. ముఖ్యంగా హైందవ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు నేర్పించాలని పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వారి ఉజ్వల భవిష్యత్ కోసం కేవలం చదువులే కాకుండా ఆధ్యాత్మిక విషయాలతో పాటు లోకజ్ఞానం తెలిసేలా వారికి చెప్పాలన్నారు. చేతనైనంతలో సహాయం చేయడం నేర్పాలని, మానవతా విలువలు గురించి నేర్పించాలని పేర్కొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రార్థనా గీతం ఆలపించి కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి ఎ పెద వెంకటరెడ్డి, ఆర్థిక కార్యదర్శి గోవిందరెడ్డి, కార్యవర్గ సభ్యులు కొల్లా వెంకటేశ్వర్లు, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, ఎస్‌వీ చలమయ్య, ఎస్.యానాదిరెడ్డి, రామయ్యస్వామి, వెలిశెట్టి నారాయణరావు, రవీంద్రకుమార్, అపర్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్‌డీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో ఆదివారం పంచాయతీ అధికారులు, సర్పంచ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులను చేపట్టారు. రొట్టెల పండగ సందర్భంగా ఏఎస్‌పేట దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో రానుండడంతో ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు పంచాయతీ సర్పంచ్ తాజున్నిసా బేగం జిలాని బాషా పారిశుధ్య పనులపై దృష్టి పెట్టారు. దీంతో ఈఓపీఆర్‌డీ ఆదివారం ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదూరమ్మ తల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


ఆదూరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి గ్రామదేవత ఆదూరమ్మ తల్లికి ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేజర్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యమానికి అనంత సాగరం మండలం సోమశిలకు వస్తున్న ఆయన మార్గమధ్యంలో ఆదూరమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చేజర్ల జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి ఉన్నారు.

ఆర్డీఓను కలిసిన ఎమ్మెల్యే


ఆర్డీఓ శీనానాయక్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: నియోజకవర్గంలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం స్థానిక ఆర్డీఓ వీకే శీనానాయక్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, షేక్ మునీర్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళల అక్రమ రవాణాను అరికడతాం

- బి రాజేష్, సీనియర్ సివిల్ జడ్జి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: విద్యార్థినులను, మహిళలను అక్రమ రవాణా చేస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు, పోలీసులకు తెలియజేస్తే అరికట్టవచ్చని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి రాజేష్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం అక్రమ రవాణాపై విద్యార్థినులకు మండల న్యాయసేవా అధికార సంఘం ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. జడ్జి రాజేష్ మాట్లాడుతూ మాయమాటలు చెప్పి కొందరు విద్యార్థినులను మోసం చేస్తుంటారని, అదే క్రమంలో నజరానాలు అందజేసి లోబరుచుకుంటారని అటువంటి వారిపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తోటి వారికి చెప్పి అప్రమత్తం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతులను ఇలా మాయమాటలు చెప్పేవారు తారస పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య సేవలను అందిస్తున్న ప్రముఖ వైద్య నిపుణులు

అల్లూరు: స్థానిక దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన ఈఎస్ఈఎల్ స్పెషాలిటీ హస్పిటల్ ప్రముఖ వైద్యులు డి మహేంద్రనాథ్‌రెడ్డి, పి హరికృష్ణ సహకారంతో దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. తమ ట్రస్ట్ ద్వారా ప్రతి నెలా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ అనిల్‌రెడ్డి, ట్రస్ట్ వైద్యశాల డాక్టర్ రమేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావ్, ప్రిన్సిపల్ ఎం శ్రీలత, హోమియో వైద్య నిపుణులు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి రజిత కిరీటధారణ

- చిన్నారులకు పెన్నులు, పుస్తకాల అందజేత


సరస్వతీ అమ్మవారికి రజిత కిరీటధారణ చేసి పూజలు నిర్వహించిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘనాథస్వామి కొలువైన పురాతన ఆలయంలో చదువులతల్లి సరస్వతీదేవి విగ్రహానికి దాత, ఎన్ఆర్ఐ చల్లా రవీంద్రారెడ్డి, రోహిణి దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఆదివారం సరస్వతీ అమ్మవారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి కిరీటానికి పూజలు చేసి అమ్మవారికి అలంకరించారు. పూజల అనంతరం చిన్నారులకు, విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యారేజీ వద్ద భక్తుల తాకిడి

- అప్రమత్తంగా ఉన్న పోలీసు, ఇతర శాఖల అధికారులు


సంగం ఎంజీఆర్ బ్యారేజ్ వద్ద భక్తుల సందడి

సంగం: ప్రపంచ నలుమూలల నుంచి నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగకు వచ్చిన భక్తులు రొట్టెల పట్టిన అనంతరం సంగం మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ వద్దకు రావడంతో ఆదివారం యాత్రికులతో సందడి వాతావరణం నెలకొంది. మూడు రోజులుగా నెల్లూరు స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకునేందుకు వచ్చిన భక్తులు బస్సులు, కార్లలో అనుమసముద్రంపేటలో ఖాజానాయబ్ రసూల్ దర్గాను సందర్శిస్తారు. తిరిగి సంగం వచ్చి పెన్నానది వద్ద సేదతీరి వంటలు చేసుకుంటున్నారు. దీంతో బ్యారేజీ వద్ద వందలాది మంది ప్రజలు రావడంతో కోలాహలంగా మారింది. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి సిబ్బందితో సంగం మండలంలోని ర్యాంప్, కావలి కాలువ, సంగం బ్యారేజీల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

ఉదయగిరి: కనీస వేతనం చట్టం అమలు చేసి అంగన్వాడీ, ఆశ వర్కర్లకు నెలకు రూ.26 వేలు వేతనం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉదయగిరి క్రిసెంట్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం డివిజన్ స్థాయి సీఐటీయూ వర్క్ షాపు జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిలు వెంటనే చెల్లించాలి కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, నేతలు కాకు వెంకటయ్య పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే


నితిన్ గడ్కరీని కలిసిన బొల్లినేని

ఉదయగిరి: కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఆదివారం పూణేలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కలిశారు. కావలి-సీతారామపురం 167 జీబీ జాతీయ రహదారి పనులు పురోగతి గురించి మంత్రికి వివరించారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు బొల్లినేని తెలిపారు.

నేడు బ్రాహ్మణపల్లిలో రెవెన్యూ సమీక్ష

ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నివాసంలో సోమవారం ఉదయం 10 గంటలకు రెవెన్యూశాఖకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మేకపాటి కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు సంబంధించి జరిగే ఈ సమీక్షలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో పాటు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని, రెండు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల తహసీల్దార్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఆగస్టు 10న రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటిస్తున్న నేపథ్యంలో జరిగే ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యత ఉందని, రెవెన్యూ అధికారులు వివరాలతో సమావేశానికి హాజరుకావాలన్నారు.

దర్గాలో దొంగల చేతివాటం

అనుమసముద్రంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగ సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో దర్గా దర్శనం కోసం క్యూలైన్‌లో వెళ్తున్న నిజామాబాద్‌కు చెందిన భక్తుడి బ్యాగ్ నుంచి రూ.20 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను దొంగలు కొట్టేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంధమహోత్సవం నేడు

ఆత్మకూరు: పట్టణంలోని ఖాజానాయబ్ రసూల్ దర్గా గంధమహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని పడమర వీధి చావిడి వద్ద నుంచి సాయంత్రం ప్రారంభమయ్యే గంధమహోత్సవం మేళతాళాలు, ముజావర్లు, ఫకీరుల విన్యాసాలతో బాణసంచా వేడుకలతో పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ప్రత్యేక పాత్రలో ఉంచిన గంధాన్ని ఒంటె వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తూ అర్ధరాత్రి సమయంలో దర్గా వద్దకు చేరుకోనుందని తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గంధ మహోత్సవాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గంధమహోత్సవంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం రాత్రి పాల్గొంటారని దర్గా నిర్వాహకులు తెలిపారు.

ఉదయగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- పార్టీని నమ్ముకున్న వారికి అధిక ప్రాధాన్యం
- పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు పెద్ద పీట
- మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి


నెల్లూరులో మాజీ ఎంపీ మేకపాటిని కలిసిన నారపరెడ్డి

ఉదయగిరి: ఉదయగిరిలో జరిగిన అభివృద్ధి అంతా మేకపాటి కుటుంబం ద్వారా జరిగిన విషయం అందరికీ విదితమేనని, మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడతామని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మేకపాటి నివాసంలో రాజమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిని ఆదివారం ఉదయగిరి ప్రాంతానికి చెందిన పలువురు పార్టీ నేతలు కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పులు పునరావృతం కావన్నారు. పార్టీని నమ్ముకున్న నేతలకు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. బ్రోకర్ల మాటలు మా వద్ద చెల్లవు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి, పార్టీ బలోపేతానికి కృషి చేయండి. ఏ విషయం అయినా నాతో స్వేచ్ఛగా మాట్లాడవచ్చని మాజీ ఎంపీ మేకపాటి భరోసా ఇచ్చారు. నియోజవర్గంలో జరుగుతున్న అన్నీ పరిణామాలు తెలుసుకుంటున్నాను, అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కోసం పని చేసే ఏ ఒక్క నేతను, కార్యకర్తను తాము వదులుకోము, అంతర్గత సమస్యలు ఉంటే తాము పరిష్కారించుకుంటామన్నారు. 2024లో వైఎస్సార్‌సీపీ జెండా ఉదయగిరి గడ్డపై రెపరెపలాడేందుకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సమన్వయకర్త రాజారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అన్నీ గ్రామాలు తిరుగుతూ అందరిని కలిస్తూ ప్రజలు సమస్యలు తెలుసుకుంటూ, వాటికి పరిష్కారం చూపుతూ ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. త్వరలోనే వెలుగొండ జలాలు ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలకు వస్తాయన్నారు. దీంతో వెనుకబడిన ఈ ప్రాంతాలు డెల్టాకు దీటుగా మారుతాయన్నారు. వింజమూరు మాజీ జెడ్పీటీసీ నారపరెడ్డి వింజమూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం అవశ్యకతను మాజీ ఎంపీ మేకపాటి దృష్టికి తెచ్చారు. ఉదయగిరి అభివృద్ధి కోసం నిధులు మంజూరు కోసం త్వరలో రాజారెడ్డి సీఎంను కలుస్తారని, తప్పక సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు నిధుల మంజూరు అయ్యేలా ప్రయత్నిస్తామని చెప్పారు. త్వరలోనే తాను నియోజవర్గంలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతానని చెప్పారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని చెప్పారు. ఆయనతో పాటు ఉదయగిరి పార్టీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి ఉన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడి



కావలి రూరల్ ఎస్‌ఐ సుమన్

కావలి: కావలి పట్టణంతో పాటు రూరల్ ప్రాంతం కూడా వాణిజ్య కేంద్రంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. సముద్ర ఆధారిత రవాణా, ఎగుమతులు, దిగుమతులు, అపారమైన మత్స్య సంపద, రవాణా తదితర విపణి ఆధారిత రంగంలో కావలి ప్రాముఖ్యత సంతరించుకోవడానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కావలికి ఉత్తరం వైపు రామాయపట్నం పోర్టు, దక్షిణం వైపు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. సముద్ర తీరంలో ఉన్న ఈ రెండు కూడా మండలంలోని సముద్రతీరానికి ఆనుకొనే ఉన్నాయి. రామాయపట్నం పోర్టు మొదటి దశ ప్రారంభించేందుకు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సన్నాహాలు చేస్తోంది. దీంతో పాటు మండలంలోనే వాహనాలతో అత్యంత రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి ఉంది. రహదారిపై వాహనాల్లో అక్రమంగా రవాణా అయ్యే సరుకులు, బిల్లులు లేని వస్తువులు, అక్రమ గ్రానైట్ రవాణా జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసు అధికారులు నిత్యం శ్రమిస్తూ, నిజాయితీగా పని చేస్తేనే పరిస్థితులు ప్రశాంతంగా ఉంటాయి. ఇటీవలే కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన శెట్టిపల్లి సుమన్‌తో సాక్షి ఇంటర్వ్యూ.

సాక్షి: కావలి రూరల్ పరిధిలోని పరిస్థితులపై అవగాహన ఏర్పడిందా?

ఎస్ఐ: అవగాహన కోసం ప్రత్యేకంగా చేసేదీ ఏమీ ఉండదు. ప్రతి రోజూ విధులు నిర్వర్తిస్తుంటే అవగాహన వచ్చేస్తోంది. ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు పోలీస్ స్టేషన్‌లో ఉంటాను. రాత్రి 9 గంటలు వరకు అందుబాటులోనే ఉంటాను. ఏ రోజు ఫిర్యాదును పరిష్కరించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాను. ఫిర్యాదుదారులతో మాట్లాడటం, కౌన్సెలింగ్‌లు చేయాల్సి ఉన్న ఫిర్యాదులపై తక్షణమే నిర్ణయం తీసుకుని అమలు చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలను కలుసుకోగలుగుతున్నాను.

సాక్షి: కేసులను ఎలా హ్యాండిల్ చేస్తున్నారు?

ఎస్ఐ: సమాచారం రాగానే తక్షణమే స్పందించడమనేది నాకు అలవాటు. తుమ్మలపెంట బీచ్ వద్దకు సముద్రస్నానికి వచ్చిన పర్యాటకులకు చెందిన 23 సెల్‌ఫోన్‌లు కొందరు కొట్టేశారు. ఈ సమాచారం నాకు రాగానే వెంటనే రంగంలోకి దిగి 23 సెల్‌ఫోన్‌లను కొట్టేసిన వారిని గుర్తించి, వాటిని బాధితులకు అందించాను. ఒడిశా రాష్ట్ర సరిహద్దులో గంజాయిని చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారి మీదుగా రవాణా చేస్తున్నారని సమాచారం రాగానే అలెర్ట్‌గా ఉండి 100 కేజీలు గంజాయిని, 17 మంది నిందితులను పట్టుకోగలిగాం. పోలీస్‌స్టేషన్ వద్ద కూడా ఫిర్యాదుదారులు పడిగాపులు కాయకుండా సత్వరమే నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి : అసాంఘిక శక్తులు విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ: అనుమానాస్పద వ్యక్తులు, నేరచరిత కలిగిన వారిపై నిరంతర నిఘా ఉంచుతున్నాం. స్థానికులు కాని వారు, ఇతర చోట్ల నుంచి వచ్చిన వారు ఏఏ చోట్ల ఏఏ పనులు చేస్తున్నారో వివరాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే పోలీస్ రికార్డుల్లో ఉన్న వ్యక్తుల తాజా స్థితిగతులపై ఆరా తీస్తున్నాం. రౌడీషీట్, సస్పెక్ట్ షీట్, హిస్టరీ షీట్ తదితర షీట్లు ఉన్న వారికి కౌన్సెలింగ్‌లు ఇచ్చాం. ఏ ప్రాంతంలో అయినా కొత్తగా ఎవరు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించాలని స్థానికులకు చెబుతున్నాం. ఇతర ప్రాంతాల నుంచి తరచూ వచ్చి పోతుండే వారి వివరాలు సేకరిస్తున్నాం. ఇలా ప్రజలు సహకారంతో ఎప్పటికప్పుడు పరిస్థితులను నిత్యం పర్యవేక్షిస్తున్నాం. ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్స్, దృష్టి మరల్చి నేరాలు చేసే ముఠాలు, బంగారం మెరుగు పేరుతో చేసే మోసాలపై విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నాం.